

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం

హాల్ టికెట్ తీసుకుని వస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని మక్కువ-శంబర రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మరిపి వలస గ్రామానికి చెందిన కోట బాలు, దబ్బగడ్డ గ్రామానికి చెందిన కార్తీక్ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు బుధవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ కోసం కాలేజీకి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మక్కువ సమీపంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు దగ్గర వీరు నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో వెనక కూర్చున్న కోట బాలు కిందపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఎవరి ధీమా వారిదే

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. గెలుపు తమదంటే తమదంటూ వైసిపి, టిడిపి చెప్ప కుంటున్నాయి. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయం ఖాయమంటూ పిడిఎఫ్ మద్దతుదారులు అంటున్నారు. ఇక బిజెపి అభ్యర్థికి నాలుగో స్థానమేనని మెజార్టీ జనం అంచనా వేస్తున్నారు. దీన్నిబట్టి ముక్కోణపు పోటీ ఉన్నట్టు కనిపిస్తోంది. ఎవరు గెలిచినా రెండో ప్రాధాన్యత ఓటే కీలకం కాబోతుందని రాజకీయ నాయకుల విశ్లేషణ.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



రమా ప్రభ (పిడిఎఫ్)

చిరంజీవిరావు (టిడిపి)

సుధాకర్ (వైసిపి)

- సంక్షేమ పథకాలు ఆకర్షిస్తాయని వైసిపి ఆశ
- వైసిపిపై వ్యతిరేకతను నమ్ముకున్న టిడిపి
- పాలకపార్టీల ప్రజావ్యతిరేక విధానాలు, నిబద్ధత గెలిపిస్తాయంటున్న పిడిఎఫ్
- బిజెపికి నాలుగో స్థానమే అంటున్న విశ్లేషకులు
- కీలకం కానున్న రెండో ప్రాధాన్యత ఓటు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ సోమవారం జరిగిన విషయం విధితమే. బ్యాలెట్ బాక్సులన్నీ అదేరోజు రాత్రి ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నడుమ విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి తరలించారు. ప్రస్తుతానికి అభ్యర్థుల భవితవ్యం ఆయా బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. ఈనెల 16న ఓట్లలెక్కింపు జరగనుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలు కూడా వెలువడనున్నాయి. విజయనగరం జిల్లాలో 58, 502 మంది ఓటర్లకు గాను 43,862 (74.98శాతం) మంది ఓటర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 18,520 ఓటర్లకు గాను 13,619 (73.54శాతం) మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని బట్టి విజయనగరం జిల్లాలో గజపతినగరం, ఎస్.కోట, రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లో పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు లీడింగ్‌లో ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో పిడిఎఫ్, వైసిపిల మధ్య పోటీ ఉంటుందని తెలుస్తోంది. అటు పార్వతీపురం జిల్లాలో కురుపాం నియోజకవర్గంలో పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్య, సాలూరు, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల్లో పిడిఎఫ్, వైసిపి అభ్యర్థుల మధ్య పోటీ ఉందని తెలుస్తోంది. దీన్నిబట్టి ఈ రెండు జిల్లాల్లో పిడిఎఫ్‌కు అనుకూలంగా ఓటింగ్ పడినట్టుగా ఎక్కువ మంది భావిస్తున్నప్పటికీ అభ్యర్థుల గెలుపు ఓటమి అనేది మొత్తం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల బలబలాలను బట్టి ఉంటుంది. విశాఖనగరంలోని ఓట్లు కూడా అత్యంత కీలకపాత్ర పోషించనున్నాయి. నగరంలోని ఓట్లు పిడిఎఫ్‌కే ఎక్కువగా పడతాయని అంచనాలు వెలువడ్డాయి. కానీ, అక్కడ ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం వల్ల పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై రాజకీయ విశ్లేషకులు సైతం మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక అనకాపల్లి జిల్లాలో పిడిఎఫ్‌కు వైసిపి గట్టిపోటీ ఇచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. అటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో టిడిపి, పిడిఎఫ్ మధ్య హోరా హోరీగా ఓటింగ్ సాగిందని అంచనా. శ్రీకాకుళం జిల్లాలో పిడిఎఫ్‌కి టిడిపికి మధ్య గట్టి ఉందని సమాచారం. దాదాపు అన్ని చోట్లా పిడిఎఫ్ పోటీ ఇచ్చినట్టు అంచనాలు వినవస్తున్నప్పటికీ ఒకటో ప్రాధాన్యత ఓటులో పిడిఎఫ్ సహా ఎవరికీ అవకాశం ఉండకపోవచ్చని పలువురు వాదిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎవరికివారే గెలుపు దీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల ప్రజానీకం ఆకర్షితులయ్యారని, ఆ పథకాలే తమను గెలిపిస్తాయని చెబుతున్నారు. టిడిపి నాయకులు మాత్రం సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరంకుశవైఖరి తమ గెలుపునకు దోహదపడుతుందని, జనం కూడా ప్రభుత్వంపై విసిగిపోయి ఉన్నారని అంటున్నారు. వైసిపి అవలంభించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక విధానాలకు తోడు మన రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపిపై నోరు మెదపకపోవడం వంటి విధానాలు, వాటికి వ్యతిరేకంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల నిబద్ధతగల పోరాటం తమకు విజయం చేకూరుస్తుందని రమాప్రభ మద్దతుదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల పట్ల కొద్దోగొప్పో నమ్మకం ఉన్నవారు కూడా రెండో ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థికే వేశారని మరికొందరి అంచనా. గురువారం రాత్రికి గెలుపు గుర్రం ఎవరో తేలనుంది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 78 పరీక్షా కేంద్రాలు
- 28,118 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4 తేదీ వరకు జరగనున్న పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షకు మొదటి ఇంటర్ విద్యార్థులు 24,463 మంది, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 23,655 మంది హాజరు కానున్నారు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించే అవకాశం లేదు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందు అంటే ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని అధికారులు తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తం 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. వీటిలో 42 ప్రైవేటు కాలేజీలు కేంద్రాలు, 36 ప్రభుత్వ కాలేజీ కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష నిర్వహణకు ఇన్విజిలేటర్‌లు 1500 మందిని నియమించారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్ లు, 10 సిటింగ్ స్క్వాడ్లను, 78 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు.

ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు, వైద్య సదుపాయం వంటి చర్యలు సౌకర్యాలు కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చర్యలతో పాటు,అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు, సిబ్బంది, పోలీసులు, మెడికల్ సిబ్బంది కూడా సెల్ ఫోన్లకు అనుమతి లేదు. విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. విద్యార్థులకు హాల్ టికెట్‌ల సమస్య ఉంటే వెంటనే 08922-237988, 9392911825 ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని అధికారులు తెలిపారు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

పరీక్షా కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు

వంగర : పరీక్షా కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేశామని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కె.నారాయణరావు, డిపార్టుమెంట్ అధికారి పి.మధుబాబు తెలిపారు. మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి 236 మంది విద్యార్థులు, ద్వితీయ ఇంటర్ పరీక్షకు 198 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

20న ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్టణం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం దృష్ట్యా ఈనెల 20న విశాఖపట్టణంలో ప్రాంతీయస్థాయి డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంవిపి బస్ కాంప్లెక్స్ పక్కనున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో 20న ఉదయం 11 గంటలకు అదాలత్ జరుగు తుందని తెలిపారు. ఫిర్యాదులను ఈ నెల 16లోగా 109వ తపాలా అదాలత్, డబ్ల్యు నాగాదిత్య కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్టణం- 530017 అనే చిరునామాకు పంపించాలని సూచించారు.

25న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

ఇటీవల అనివార్య కారాణాల వల్ల వాయిదా పడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం జిల్లా శాఖ వార్షిక సాధారణ సర్వ సభ్య సమావేశం ఈనెల 25న నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి సత్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో కమిటీ ప్రెసిడెంట్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, దానిలోనే మేనేజింగ్ కమిటీ మెంబర్ల ఎంపిక ప్రక్రియ కూడా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు, ప్యాట్రన్లు, వైస్ ప్యాట్రన్లు, కమిటీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని ప్రకటన ద్వారా కోరారు.

నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన పేదలందరికీ వెంటనే ఇళ్లు ఇవ్వాలని జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఎస్‌వి రమణమూర్తిని కలిసి వినతినిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గదుల వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో నిరుపేదలు, పేద, మధ్యతరగతి, మైనారిటీ కులాలకు చెందిన 80 శాతం మంది దినసరి కూలీలుగాను, వ్యవసాయ కూలీలు గాను, ఆటో రిక్షా కార్మికుల గాను జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. వీరంతా ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారని అన్నారు వీరందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిలి నాగభూషణం. వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు మలిచర్ల దుర్గారావు, కార్యదర్శి ఎస్ ఎస్ రెడ్డి, యువ నాయకులు పట్నాల వెంకటేశు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, సాతి స్వచ్ఛంద సంస్థ కలసి విజయనగరం సబ్ జైల్‌లో ఉన్న నిందితులకు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభు మాట్లాడుతూ జీవితాల్లోకి హెచ్‌ఐవి, ఎయిడ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ హెచ్‌ఐవిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.దుర్గారావు, సుఖ వ్యాధుల చికిత్స కేంద్రం సూపరింటెండెంట్ డి.త్రినాధ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మేరక తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

నెల్లిమర్ల నీటి పథకాలను పరిశీలించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం నెల్లిమర్ల వాటర్ వర్క్స్ ప్రాంతాలను నగర పాలక వర్గ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కోలగట్ల పరిశీలించారు. బావులలో నీటిమట్టాలు, పంపింగ్ విధానం, జనరేటర్ పనితీరు తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము అధికారం చేపట్టిన దగ్గరనుంచి మంచినీటి సమస్య లేకుండా చేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నామని అన్నారు. రోజు విడిచిరోజు నీరు అందిస్తున్నామన్నారు. నీటి సరఫరాలో అసౌకర్యం లేకుండా చూస్తున్నామన్నారు. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్లే తాగు నీటి విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ రాలేదన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో 200 రూపాయల కనెక్షన్లను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అర్హత ఉండి 200 రూపాయలకే కుళాయి కనెక్షన్లు పొందలేనివారు తక్షణం ఆయా డివిజన్ల కార్పొరేటర్లను సంప్రదించాలని చెప్పారు. అపార్ట్మెంట్లు, గ్రూప్ హౌస్ లలో కుళాయి కనెక్షన్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవికాలంలో తాగునీరు సమృద్ధిగా ఉండాలన్న ఉద్దేశంతో చంపావతి వాటర్ వర్క్స్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నామన్నారు. అవసరమైతే తోటపల్లి నుండి నీటిని రప్పించేందుకు అధికారులతో సంప్రదింపులు జరిపామన్నారు. పర్యటనలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్ లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, పార్టీ నగరపాలక అధ్యక్షులు ఆశపు వేణు, పార్టీ జోనల్ ఇంచార్జులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగరపాలక ఇఇ కె.శ్రీనివాసరావు, డిఇ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల చంపావతి నదిలో నీటి పథకాలను పరిశీలిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం

అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న చెంచుల కోలనీ, చర్చిలో మంగళవారం పిజి స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు త్యాడ రామకష్ణారావు (బాలు) నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కర్రోతు సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా హెచ్ 3ఎన్ 2 వైరస్‌తో కూడిన ఫ్లూ జ్వరాలతో బాధపడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ప్రజలకు బాగా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పిజి స్టార్ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.కామేశ్వరరావు, లాబ్ టెక్నీషియన్ కాంత, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ అభిషేక్ సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, డిస్ట్రిక్ట్-102 క్యాబినెట్ సెక్రటరీ టి. చిరంజీవిరావు, డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, క్లబ్ గౌరవ అధ్యక్షులు ఎ.తిరుపతి రావు, సాయి కృష్ణా వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దూబే మరణం పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మంచితనానికి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన వైసిపి కంటోన్మెంట్ జోనల్ కోఆర్డినేటర్ వినోద్ కుమార్ దూబే మృతి వ్యక్తిగతంగానే కాకుండా వైసిపికి తీరని లోటని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం పార్టీ జోనల్ కార్యాలయంలో వినోద్ కుమార్ దుబే సంస్మరణ సభ జరిగింది. ముందుగా దూబే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ చిరకాల మిత్రుడు, తన కుటుంబ సభ్యుడిగా ఉండే వినోద్ కుమార్ దుబే అకాల మరణం తీరని లోటని అన్నారు. తన రాజకీయ జీవితం ప్రారంభం నాటి నుండి దూబే తన వెంటే నిలిచారని అన్నారు. కంటోన్మెంట్ జోనల్ పరిధిలోని పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువ రానివన్నారు. సీనియర్ న్యాయవాది కోలగట్ల తమన్న శెట్టి మాట్లాడుతూ వినోద్ కుమార్ దుబే మరణం ఆయన కుటుంబానికే కాక తమ కుటుంబానికి తీవ్ర విషాదాన్ని నింపిందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, విజయ శంకర్ దూబే, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న యూనివర్శిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్

ముగిసిన జాతీయ సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జివిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కష్టపడితే ఎటువంటి పనిలోనైనా విజయాన్ని సాధించవచ్చునని అన్నారు. ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సరిగ్గా ఉపయోగించుకొంటే భవిష్యత్తులో మంచి స్థాయిని చేరుకోగలుగుతామని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాన్స్‌కో ఎస్ఇ బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో ప్రతి దాన్ని బ్యాలెన్స్ చేసుకోగలిగితే ఎటువంటి పనిలోనైనా విజయాన్ని సాధించవచ్చునని అన్నారు. కన్వీనర్ డాక్టర్ విఎస్ వకుళ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇఇఇ విభాగం వ్యవహరించారు. సదస్సులో ఇఇఇ విభాగాధిపతి ఎ.పద్మజ పాల్గొని ప్రసంగించారు. కారక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (కాంటాక్ట్), విద్యార్థులు పాల్గొన్నారు.

మన్యం జిల్లాలో ఐదు స్కిల్ హబ్‌లు

- 1నుంచి కోర్సులు ప్రారంభం
- జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్



ప్రజాశక్తి -పార్వతీపురం కలెక్టరేట్

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నామని, ఏప్రిల్ 1నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు. సాయికుమార్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గుమ్మలక్ష్మీపురం, ప్రభుత్వ ఐటిఐ కళాశాల సాలూరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల సాలూరు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల-పార్వతీపురం, ప్రభుత్వ ఐటిఐ కళాశాల సీతంపేటలో ఏర్పాటు చేశామని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం స్కిల్‌హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్, కుట్టు మిషన్ ఆపరేటర్ కోర్సులకు ట్రైనింగ్ ఇచ్చామన్నారు. ట్రైనింగ్ అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇస్తామన్నారు. వీరి విద్యార్హత 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 33497878878557 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. పార్వతీపురం స్కిల్ హబ్‌లో రిటైల్ సేల్స్ అసోసియేట్, మొబైల్ ఫోన్ అసెంబ్లింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం వారికి విద్యార్హతలు టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదువు కున్న యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని 9381885611, సూచించారు. 9391742042, సాలూరు డిగ్రీ స్కిల్హబ్ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్ ఎక్జిక్యూటివ్ కోర్సులకు ట్రైనింగ్ ఇస్తామన్నారు. అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇస్తామని, విద్యార్హత ఇంటర్ ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు, మాస్టర్ ఆఫ్ కామర్స్ చదువుకున్న యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు 8555909899, 6305110947 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని, సాలూరు ఐటిఐ కళాశాల స్కిల్ హబ్ నందు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫాబిరికేషన్ కోర్సుకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇస్తామన్నారు. విద్యాఅర్హత ఇంటర్, ఐటిఐ పూర్తి చేసిన యువకులు అర్హులని వారు 9494777553, 9666200617 సంప్రదించాలని సీతంపేట ఐటిఐ కళాశాల స్కిల్ హబ్ నందు అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ ఫోర్ వీలర్ సర్వీస్ టెర్షియన్లు కోర్సులకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని ట్రైనింగ్ అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇవ్వడం జరుగు తుందని వారి, విద్యా అర్హత ఇంటర్, ఐటిఐ డిప్లొమా పూర్తి చేసిన వారు 7032060773 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చున్నారు. ఆసక్తి గల వారు 9502407824 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.



ఎన్‌సిఎస్ థియేటర్‌లో కేక్ కట్ చేస్తున్న జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు

ఆస్కార్‌తో సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం

ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా మంగళవారం ఎన్‌సిఎస్ థియేటర్‌లో సంబరాలు నిర్వహించారు. నందమూరి తారక రామారావు సేవాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కుమార్, యు.శ్రీను, అంజనీపుత్ర చిరంజీవి ప్రజాసేవాసంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, లోపింటి కళ్యాణ్ సంయుక్తంగా సంబరాలను జరుపుకున్నారు. ముందుగా మెగా ఫ్యామిలీ సీనియర్ అభిమాని కె.కృష్ణారావు, థియేటర్ అసిస్టెంట్ మేనేజర్ కుమార్ కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎన్‌టిఆర్ సేవా సమితి వ్యవస్థాపకులు ఎం.అప్పారావు, అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడారు. తెలుగుకు అచ్చమైన సాంప్రదాయమైన పదాలతో నాటు నాటు పాటను రచించిన చంద్ర బోస్, దానికి వీణుల విందైన సంగీతాన్ని అందించిన ఎం.ఎం.కీరవాణి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళి కృష్ణ

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

బొబ్బిలి : మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మల్లమ్మపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అన్ని వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో కౌన్సిలర్లు తెంటు పార్వతమ్మ, కె. రామారావు , నాయకులు ఉన్నారు.

పాఠశాల భవనాన్ని తక్షణమే ప్రారంభించాలి

కురుపాం : మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ.4.30కోట్ల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ ఐటిడిఎ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సౌలభ్యం కోసం భవనం నిర్మించినంత వరకూ బాగానే ఉన్నప్పటికీ ఆ భవనం నిర్మించి మూడేళ్లయినా నేటికీ ప్రారంభించకపోవడం వల్ల విద్యార్థులు పాత భవనాల్లో చాలీ చాలని ఇరుకు గదుల్లో చదువుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి గిరిజన విద్యార్థుల చదువులకు సహకరించాలని ఆయన కోరారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

సీతానగరం : జగనన్న లేఅవుట్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ ఎఇ నిహాల్ జానకిరామయ్య అన్నారు. మండలంలోని చెల్లంనాయుడువలసలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్ లబ్ధిదారులకు కావాల్సిన సామగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి వారం రోజులకు వారు చేసే పనిని పేమెంట్లు జరుగుతాయన్నారు. ఉగాది నాటికి లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీటర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పి.కృష్ణ, సత్యనారాయణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి విరాళం

కురుపాం : కురుపాంలో నిర్మిస్తున్న ముస్లిం శ్మశానవాటికకు విశాఖపట్నంలో గల ప్రముఖ గుండె వైద్య నిపుణులు ప్రసాద్ లాల్ రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ముస్లిం కమిటీ సభ్యులు షేక్‌గౌస్, నౌషాద్, బకరి, రఫీ మంగళవారం విశాఖపట్నంలో ఆయన నివాసం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సభ్యులు మాట్లాడుతూ కురుపాంలో ఇప్పుడిప్పుడే ప్రముఖ గుండె వైద్య నిపుణులుగా విశాఖలో స్థిరపడి ఉన్నప్పటికీ తన సొంత ఊరైన కురుపాం గ్రామస్తులకు ఎప్పుడు ఏ అవసరమైనా తక్షణమే స్పందించి ఆదుకుంటున్నారని అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌లాల్‌కు ముస్లిము కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

పాలకొండ రూరల్ : అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినిలకు జిల్లా అగ్రిల విజయ్ రాజ్‌కుమార్ స్థానిక కోర్టులో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అగ్ని గంగమ్మ జాతరకు పోటెత్తిన జనం

పార్వతీపురం రూరల్ : జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఒడిశా సరిహద్దుల్లో కొరాపుట్ జిల్లా బందుగాం బ్లాకు నీలావడిలో జరుగుతున్న అగ్ని గంగమ్మ జాతరకు ఆంధ్రా - ఒడిశా గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. వసంతపేటలో ఉన్న అమ్మవారిని వారం రోజుల పాటు నీలావడికి తీసుకొచ్చి ఘటాల రూపంలో పూజలు చేస్తారు. ఉదయం జరిగిన తోలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. జాతరలో ప్రధాన దినమైన మంగళవారం అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆదివాసీలకు ఆరాధ్య దైవమైన అమ్మవారిని దర్శించుకుని బుధవారం వేకువజామున జరిగే మొక్కు నిప్పుల తొక్కే కార్యక్రమం జరిగిన తర్వాత అమ్మవారిని వసంతపేటకు తీసుకెళ్తారు. అంతటితో పండగ ముగుస్తుంది. ఈ జాతర సందర్భంగా ఏర్పాట్లు చేసిన అంగళ్లు పండుగకు మరింతగా శోభను చేకూర్చుతాయి.

16 నుంచి కోటదుర్గ ప్రతిష్ట మహోత్సవాలు

వీరఘట్టం : మండల కేంద్రంలోని ఈనెల 16 నుంచి కోట దుర్గ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక సర్వ జోషులు శ్రీ వెంకటలక్ష్మి నరసింహశర్మ యాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి మండల కేంద్ర ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పాఠశాలల్లో ఆరోగ్య మేళా


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాజు

వేపాడ : వేపాడ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు బక్కున్నాయుడుపేటలోని గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం వైద్య మేళా నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఈ మెగా వైద్య మేళాను నిర్వహించారు. ఇందులో భాగంగా టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె. రాజు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి, ఏఎన్ఎం దీప, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నివాళి


నివాళ్లర్పిస్తున్న నాయకులు

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన జగరవు పెదరామునాయుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన పార్థివ దేహాన్ని మంగళవారం టిడిపి నియోజకవర్గం నాయ కుడు గొంప కృష్ణ, నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఉపాధ్యక్షులు పోతల రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, నాయకులు సిరికి రమణ, సిరికి సూర్యనారాయణ, మంచిన అప్పలసూరి, సేనాపతి గణేష్, వి జగ్గుబాబు, వంటాకు శ్రీను తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఆచూకీ తెలిస్తే చెప్పండి

గుర్ల : మండలంలోని పల్లిగండ్రేడు గ్రామానికి చెందిన పెనుమాల రాంబాబు ఈ నెల 8వ తేదీ నుంచి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వివిధ గ్రామాల్లో వెతికారు. అయినప్పటికీ అతని ఆచూకీ దొరకలేదు. పెనుమాల రాంబాబు వికలాంగుడు. ఇతనికి మాటలు రావు. అమ్మ, అక్క అన్న మాటలు తప్ప మరి ఏమి మాట్లాడలేరు. ఇతను 5.2 అడుగుల ఎత్తు ఉంటారు, తెలుపు, నీలి రంగు కలిగి ఉన్న టీషర్ట్‌ను ధరించారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు ఈ కింది ఫోన్ నెంబర్లకు 9346456133, 9666611909, 8886962609 తెలియజేయాలని కుటుంబ సభ్యులు, రాంబాబు చెల్లి ఆదిలక్ష్మి కోరుతున్నారు.

రెండేళ్లు గడిచినా..

పూర్తికాని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు

● ఒక్కొక్క నిర్మాణానికి రూ.17.50 లక్షలు కేటాయింపు ● అయినా ముందుకు కదలని పనులు ● అద్దె భవనాల్లోనే ఆరోగ్య ఉప కేంద్రాలు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాలు అరకొర వసతులతో కొట్టిమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల అద్దె భవనాల్లోనే వైద్య సేవలందిస్తున్నారు. ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో వైద్య సిబ్బంది సొంత నిధులతో అద్దె చెల్లిస్తున్నారు. వీటికి వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు పేరుతో పక్కా భవనాలు నిర్మించాలని తలపెట్టినా అవి పూర్తి కాకపోవడంతో ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహించవలసిన పరిస్థితి నెలకొందని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.250 ఇచ్చి అద్దె భవనాల్లో వైద్య సేవలు కొనసాగించింది. ప్రస్తుత ప్రభుత్వం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ఉప కేంద్రాలకు అద్దె చెల్లించకపోవడం మరింత భారంగా మారిందని ఆరోగ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని 39 గ్రామ పంచాయతీలలో 25 సచివాలయాల పరిధిలో 22 వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కొక్క హెల్త్ క్లినిక్‌కు ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ. 17.50లతో నిర్మాణాలు


కందిశలో ముందుకు సాగని వైయస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణం

చేపట్టవలసి ఉంది. అయితే ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టినా బిల్లులు అందవని కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఈ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకూ అంబకండి 1, వెంకంపేట హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి కాగా, అంబకండి 2 బిల్లులు చాలక మధ్యలోనే నిర్మాణం ఆపేశారు. కొన్ని చోట్ల పునాది స్థాయిలోను, ఇంకొన్ని స్థలాలు లేక, మరికొన్ని కట్టడాలు పూర్తికాక గత రెండేళ్లుగా అసంపూర్తిగానే ఉండిపోయాయి. నిధులు చాలక కొన్ని, బిల్లులు చెల్లించక మరికొన్ని ఇలా ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 10 హెల్త్ క్లినిక్‌లు, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టవలసి ఉంది. గతంలో రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 6 ఆరోగ్య ఉప కేంద్రాలు, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మరో ఆరు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఈ ఉపకేంద్రాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతూ వైద్య సేవలు జరుగు గదిలోనే నిర్వహిస్తున్నారు. ఈ అద్దె భవనాల్లో ఉన్న ఉపకేంద్రాలకు అరకొర అద్దెలు ప్రభుత్వాలు ఇస్తూ, సరైన సదుపాయాలు లేక కొన్నిచోట్ల పూరి పాకాల్లోనూ, మరికొన్ని చోట్ల పెంకుటింటిలోనూ, ఇంకొన్నిచోట్ల డాబాలలోను నడిపిస్తున్నారు. ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించడంతో రోగులకు సరైన సదుపాయాలు లేని దుస్థితి కనిపిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందకపోవడంతో ఇటు సిబ్బంది, అటు రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టడంతో అద్దె భవనాల్లో నడుస్తున్న వాటికి ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదు. దీంతో ఆయా ఉప కేంద్రాలు పరిధి ఏఎన్ఎంలే అద్దె సర్దుబాటు చేస్తూ ఉప కేంద్రాలు నడిపిస్తున్నారు. హెల్త్ క్లినిక్ నిర్మాణం ప్రారంభించి రెండేళ్లవుతున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడం, ప్రస్తుత అద్దె కొంపల్లో నడుస్తున్న వాటికి ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో ఎలా నడిపేదని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి హెల్త్ క్లినిక్‌లు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోడంతో పాటు అద్దె చెల్లించేలా కృషి చేయాలని కోరుతున్నారు.


బిల్లులు అందక మధ్యలో నిలిచిపోయిన లక్షుంపురం హెల్త్ క్లినిక్

నిధులు చాలక ముందుకు రావడం లేదు




వైయస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు నిధులు చాలడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మండలంలో 25 సచివాలయాలు గాను, 22 వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కొక్క హెల్త్ క్లినిక్‌కు రూ.17.50 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుత రేట్లు ప్రకారం నిధులు చాలక ఎవరూ ముందుకు రావడం లేదు. అంబకండి.1, వెంకంపేట హెల్త్ క్లినిక్‌లు మాత్రమే పూర్తయ్యాయి. అంబకండి 2, నిధులు చాలక ఆపేశారు. స్థానిక నాయకులతో ఒప్పించి నిర్మాణాలకు చర్యలు తీసుకున్నాం. నిధులు చాలని విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేశాం. అదనంగా మంజూరు అయితే నిర్మాణాలు వేగవంతం అవుతాయి.

రామకృష్ణారావు, పిఆర్‌జెఇ రేగిడి

బ్యాడ్మింటన్ క్రీడాకారునికి ఘన సన్మానం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణానికి చెందిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కోట అపర్ణ బాబాను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సోదరుడు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ మురళీ కృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకొని క్రీడల్లో రాణించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాలన్నారు. ఇటీవల ప్రొద్దుటూరులో


అపర్ణబాబాను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో పాల్గొని పురుషులు సింగిల్ విభాగంలో గెలిపొంది నేషనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి ఘనతను సాధించిన అపర్ణ బాబాను పట్టణంలో క్రీడకారులంతా ఆదర్శంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. నేషనల్ స్థాయిలో జరగబోయే బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్న అపర్ణ బాబాకు ఆర్థిక సహాయంగా ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు రూ. 20వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. నేషనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని గెలుపొంది విజయనగరం జిల్లాకు బొబ్బిలి నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరావు (విస్సు), సుంకర సాయి రమేష్, పిడి వెంకట్ నాయుడు, ఇంతియాజ్, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

టైక్వాండోలో బొబ్బిలి క్రీడాకారుల ప్రతిభ

ఈ నెల 10,11,12 తేదీల్లో యలమంచిలిలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ టైక్వాండో ఛాంపియన్ షిప్


క్రీడాకారులను అభినందిస్తున్న బేబినాయన

పోటీల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. వీరిలో చరిత, యశస్విని బంగారు పతకాలు సాధించగా ఆదిత్య, శివరామకృష్ణ, తన్మై, జాజిలి, జాహ్నవి, సంజన రజిత పతకాలు, గౌతమి, సుశాన్సీ, వరలక్ష్మి దర్శత్ కాంస్య పతకాలను సాధించారని కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ క్రీడాకారులను బొబ్బిలి టైక్వాండో క్లబ్ ప్రతినిధి బేబీ నాయన కోటలో మంగళవారం అభినందించారు.

డూప్లికేట్ ఓట్లు రద్దు

బొబ్బిలి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓట్లను రద్దు చేశామని తహశీల్దార్ పి.రాజారావు చెప్పారు. ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఇచ్చామన్నారు. ఒక వ్యక్తికి కొన్ని కారణాల రీత్యా రెండు, ఆపైన ఓట్లు వచ్చినప్పటికీ అభ్యంతరాలు స్వీకరించి డూప్లికేట్ ఓట్లను రద్దు చేశామన్నారు. చింతాడకు చెందిన కర్రి లక్ష్మునాయుడుకు పది ఓట్లు ఉండగా తొమ్మిది ఓట్లు రద్దు చేసి ఒక ఓటు మాత్రమే ఉంచామన్నారు. బొబ్బిలిలో ఎటువంటి నకిలీ ఓట్లు లేవని ఆయన చెప్పారు.

కనకదుర్గ గుడిలో ఎమ్మెల్యే

బొబ్బిలి : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న కనకదుర్గమ్మను మంగళవారం ఉదయం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరిపై దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయ పండితుల ఆశీర్వచనాలు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సిబ్బందికి సిగ్నల్ కష్టాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగుపూడి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది ఫోన్లకు సిగ్నల్ లేక ఇబ్బందులు పడతున్నారు. చెట్ల కింద కొంతమంది, పొలం గట్ల మీద కొంతమంది, చెరువుగట్లు వద్దకు పోయి సిగ్నల్ కోసం పడి గాపులు కాస్తున్నారు. ప్రభుత్వం సిగ్నల్ వ్యవస్థను బాగు చేయించి సచివాలయ సిబ్బందికి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


చెట్ల కింద విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులుత

ఆర్ఆర్ఆర్‌కు అభినందనలు



భాస్కరరావు వేసిన కర్టూన్

బొబ్బిలి: నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కించుకున్న ఆర్ఆర్ఆర్ చిత్ర యూనిట్‌కు స్థానిక కార్టూనిస్టు గుంట్రెడ్డి భాస్కర రావు (భాను) తాను గీసిన కార్టూన్ చిత్రంతో అభినందనలు తెలిపారు. చిత్ర కెప్టెన్ రాజమౌళి, రచయిత చంద్రబోస్, సంగీత దర్శకులు ఎంఎం కీరవాణికి శుభాకాంక్షలు తెలిపారు. పాటపాడిన గాయకునికి, హీరోలకు కూడా అభినందనలు తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు

రేగిడి : ఉపాధి హామీ పథకంలో ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం వేతనదారులు పనులు చేస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సంకాబత్తుల హరినాథ్ సూచించారు. మంగళవారం మజ్జిరాముడుపేట గ్రామంలో పెద్ద మొక్కవాని చెరువు పనులను ఆయన పరిశీలించారు. ముందుగా మస్టర్స్ తనిఖీ చేశారు. కొలతల ప్రకారం రెండు పూటలా పని చేస్తే రూ.257 కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌లో వేతన దారుల పనుల ఫొటో అప్లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. యాప్‌లో నమోదు చేయకుంటే


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎపిఒ

వేతనధారులకు పూర్తిగా కూలి రాదని అన్నారు. బాధ్యతగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. వేసవి ఎండలకు తాగునీరు, నీడ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.


విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న గొంప కృష్ణ తదితరులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికలు వసతి గృహంలో 74 మంది విద్యార్థులకు, కస్తూరిబాలో 45, కొత్తవలస కేజీబీవీలో 101 విద్యార్థినిలకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రూ. 50 వేలు విలువగల ప్లాంక్, ఎరేజర్, సార్పినర్, స్కేల్, రెండు పెన్నులు, పెన్సిల్‌ను టిడిపి నియోజకవర్గం నాయకుల గొంప కృష్ణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. విద్యార్థులకు ఏ రంగంలో శ్రద్ధ ఉంటే ఆ రంగంలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, కొత్తవలస టిడిపి మండల అధ్యక్షుడు గోరపల్లి రాము, వేపాడ టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు, నాయకులు సేనాపతి గణేష్, మంచిని అప్పలసూరి, గొర్ల నాగరాజు, సేనాపతి అప్పారావు, కె.అర్జునరావు, సిరిక రమణ, తాడి కృష్ణ, చొప్ప దేముడు, ఆయా పాఠశాలలు ప్రిన్సిపాల్స్ యు.ఉషారాణి, కె.విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

భూ రక్ష -భూ హక్కు పథకంలో భాగంగా జరుగుతున్న భూ రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ సిబ్బంది కోరారు. మండలంలోని బైరిపురంలో మంగళవారం రీ సర్వే చేశారు. దీనికి ముందు గ్రామ సచివాలయం వద్ద రైతులతో గ్రామ సభ ఏర్పాటు చేసి ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం సర్వే సిబ్బంది తెలియ చేశారు. అనంతరం గ్రామ వ్యవసాయ పరిసర ప్రాంతాలలో రీసర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పప్పల విజయకుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, మాజీ సర్పంచ్ కే. ధనంజయ, గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరావు, బోర అప్పలనాయుడు, మండల డిప్యూటీ తహశీల్దార్, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.


బైరిపురంలో రీ సర్వే చేస్తున్న సిబ్బంది



మొక్కలను పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

మహిళలకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జనసేన కార్యాలయంలో మహిళలకు జనసేన నాయకులు బి.దివ్య తులసి మొక్కలను పంపిణీ చేశారు. బొబ్బిలిలో జనసేన బలోపేతానికి పని చేస్తామని దివ్య అన్నారు. మహిళలు సంక్షేమానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళలపై దాడులను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు యామిని, రమ్య, లక్ష్మీ, నాగమణి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దత్తిరాజేరు : ఒడిషాలోని బర్గా వద్ద బోలేర వహానం బోల్తాపడిన ఘటనలో మండలంలోని వంగర గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. గెంజి రామారావు(45) గొర్రెలు, మేకలు కొనేందుకు బొలేరా వాహనంలో మంగళవారం ఒడిషా వెళ్లాడు. వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు భార్య జయలక్ష్మి, కుమారుడు హేమసాయి, కుమార్తె ధనుష ఉన్నారు.

ట్రాక్టర్-మోటార్ సైకిల్ ఢీ

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడివలస సమీపంలో మలుపు వద్ద ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీకొనడంతో మోటార్ సైకిలిస్ట్ డి.తేజ తీవ్రంగా గాయపడ్డారు. మక్కువ మండల కేంద్రం జంగాలవీధికి చెందిన డి.తేజ బొబ్బిలి నుంచి మక్కువ వెళ్తుండగా దిబ్బగుడివలస దాటిన వెంటనే ఉన్న మలుపు వద్ద మక్కువ నుంచి బొబ్బిలి వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన తేజను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెకానిక్ షెడ్ దగ్ధం

నిప్పపెట్టిన గుర్తు తెలియని దుండగులు
రూ.3లక్షల ఆస్తినష్టం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని తోటపాలెం సెంట్రల్‌బ్యాంకు ఎదు రుగా గల మెకానిక్ షెడ్‌కు గుర్తు తెలి యని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న రాపాక కృష్ణ సెంట్రల్ బ్యాంకు వద్ద మెకానిక్‌షెడ్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్‌కు పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో అందులో ఉన్న 15 బైక్‌లు, పలు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. సామాగ్రి, ఇంజిన్ ఆయిల్ డబ్బాలు దగ్ధమ య్యాయి. పలువురు రిపేరు కోసం ఇచ్చిన బైక్‌లు కాలిపోవడంతో షెడ్


కాలి బూడిదైన మెకానిక్ షెడ్‌లోని వాహనాలు

యజమాని తీవ్ర ఆందోళన చెందారు. ఈ సంఘటనలో సుమారు 3లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా. కృష్ణ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, ఎస్ఐ అశోక్ కుమార్ తదితరులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. మద్యం, గంజాయి వంటి దురలవాట్లకు బానిసలైన ఎవరో ఆకతాయిలు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని, సిసి కెమెరాలు ఆధారంగా నిందితులను పట్టుకుంటామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని వైసిపి నాయకులు బి.రవిచంద్ర, కార్పొరేటర్ రంగా తదితరులు పరిశీలించారు నిందితులను త్వరగా పట్టుకోవాలని కోరారు.